అంబరాన్నంటిన 'ఆసరా' సంబరాలు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ఘనంగా వారోత్సవాలు
- రుణమాఫీపై డ్వాక్రా మహిళల ఆనందోత్సాహాలు
- 'ఉత్తర'లో 33,388 మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి
- మహిళలకు రూ.21.27 కోట్ల చెక్కు అందజేసిన మేయర్, నెడ్‌క్యాప్ ఛైర్మన్
- ముఖ్యమంత్రి జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, అధికారులు


కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తర నియోజకవర్గ డ్వాక్రా సంఘాల మహిళలు

తాటిచెట్లపాలెం: ఉత్తర నియోజకవర్గంలో గురువారం వైఎస్సార్ ఆసరా సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో కైలాసపురం దరి డీఎల్‌బీ గ్రౌండ్స్ వేదికగా ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధి డ్వాక్రా మహిళల ఖాతాల్లో వరుసగా నాలుగో ఏడాది రుణమాఫీ నగదు జమైన సందర్భంగా వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులతో కలిసి సంబరాలు జరిపారు.

నాడు తండ్రి.. నేడు తనయుడు

ఈ సందర్భంగా ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ నాడు తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పేదల కోసం పరితపిస్తే.. నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాష్ట్రంలో ప్రతి మహిళా, అవ్వతాతలు, విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం కోసం పనిచేస్తున్నారన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని, నియోజకవర్గంలో కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.

మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట

సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలంటే మహిళలు ఆర్థికంగా, బలంగా ఎదగాలని, రాష్ట్రంలోని ప్రతి అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా డ్వాక్రా మహిళల రుణాలు మాఫీచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు.

ప్రతి మహిళా జగనన్నకు ఎంతో రుణపడి ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నాలుగు విడతల్లో రూ.64.26 కోట్ల జమ

వైఎస్సార్ ఆసరా నాలుగో విడతగా ఉత్తర నియోజకవర్గంలోని మొత్తం 3,239 స్వయం సహాయక సంఘాల్లో గల 33,388 మంది సభ్యులకు రూ.21.27 కోట్లను జమ చేసినట్లు కె.కె.రాజు తెలిపారు. ఇంతవరకు మొత్తం నాలుగు విడతల్లో నియోజకవర్గ పరిధిలో రూ.64.26 కోట్లు డ్వాక్రా సంఘాల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా జమచేసిందని చెప్పారు.

కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, విజయలక్ష్మి, యూసీడీ పీడీ పాపునాయుడు, ఏపీడీలు పద్మావతి, దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎన్.శశికళ, కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ రాష్ట్ర నాయకులు పేడాడ రమణికుమారి, కిరణ్‌రాజు, అంబటి శైలేష్, పార్టీ మండల అధ్యక్షులు జి.వి.రమణి, కృష్ణారావు మాస్టర్, జిల్లా నాయకులు ఆళ్ల శివగణేష్, కేవీ బాబా, బి.రాధ, వార్డు ఇన్‌చార్జిలు నీలి రవి, పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, జేసీఎస్ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సీవోలు, ఆర్పీలు, కార్యకర్తలు, ఆసరా లబ్ధిదారులు, అభిమానులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, పార్టీ నాయకులు. చిత్రంలో మహిళల ఆనందోత్సాహాలు


నవరత్నాల ముగ్గు ముందు ఆనంద నృత్యం చేస్తున్న మహిళలు

రుణమాఫీ చేసి ఆదుకున్నారు

2006 నుంచి డ్వాక్రా సంఘంలో ఉన్నాను. గతంలో ఎవ్వరూ ఇలా రుణాలను మాఫీ చేయలేదు. వరుసగా నాలుగో ఏడాది కూడా ఈ ప్రభుత్వం మాకు రుణమాఫీ చేసి, మమ్మల్ని ఆదుకుంది. మేం నిలదొక్కుకునే అవకాశం ఇచ్చింది. – ఎ.పెంటమ్మ, వైఎస్సార్ నగర్

ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడ్డాం

కొన్నేళ్లుగా పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్నాం. ఈ సారి మా గ్రూప్‌నకు మొత్తం రూ.2.71 లక్షల రుణమాఫీ జరిగింది. మా మీద ఆర్థిక భారం లేకుండా చేసి మమ్మల్ని ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉన్నాం.

– బి.శ్యామలాదేవి, సంఘం ఆఫీస్

క్లుప్తంగా

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్వారకానగర్‌లోని వీటీ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ద్వారకా పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ వాహన చోదకులందరూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాత లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, సిగ్నల్ పాయింట్ వద్ద రెడ్‌లైట్ వెలిగినప్పుడు రోడ్డు దాటరాదని, గ్రీన్ లైట్ వెలిగినప్పుడు వెళ్లాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఆర్ఐవో మురళీధర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.మురళీధర్‌ను గురువారం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్.కృష్ణా జూనియర్ కాలేజీ అధ్యాపక బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. విద్యార్థుల అభ్యున్నతికి అంతా సమన్వయంతో పనిచేద్దామని ఆర్ఐవో మురళీధర్ వారికి సూచించారు. ఆర్ఐవోను సత్కరించిన వారిలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు మురళీకృష్ణ, హేమంత్‌కుమార్, వేద వ్యాస్, గోవిందరావు, ఆర్.పి.నాయుడు, సన్యాసిరావు, రాజశేఖర్‌రెడ్డి, సూర్యకుమారి తదితరులు ఉన్నారు.

4న ఆర్‌పీఐ బహిరంగ సభ

సీతంపేట: ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) బహిరంగ సభ జరుగుతుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణరావు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో జాతీయ, రాష్ట్ర నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు.

9న డీ వార్మింగ్ డే


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు కోరారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల బాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున స్కూళ్లకు హాజరుకాని పిల్లలకు 16న మాత్రలు అందించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ డీ వార్మింగ్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో డీఈవో మాటామంతీ


8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ


ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం డీఈవో చంద్రకళ ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్నం స్కూల్‌ను సందర్శించిన ఆమె 8వ తరగతి క్లాస్ రూంకు వెళ్లి విద్యార్థులకు ఇచ్చిన బైజ్యూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. కొంత మంది ట్యాబ్ తీసుకురాకపోవడంతో మందలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్యాబ్ తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గణిత పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె ప్రశంసించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డీఈవో వెంట హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన


సర్టిఫికెట్లతో ఎన్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు

సీతమ్మధార: విశాలాక్షినగర్‌లోని బీవీకే హైస్కూల్‌లో గత నెల 28న యూత్ ఫర్ సేవా సంస్థ 'చిగురు' నిర్వహించిన క్రీడా పోటీల్లో సీతమ్మధార పీ అండ్ టీ కాలనీ ఎన్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. 9వ తరగతి విద్యార్థిని హెచ్.సౌజన్య క్విజ్, ఏడో తరగతి విద్యార్థినులు బి.పావని, పి.లిఖిత రన్నింగ్, 8వ తరగతి విద్యార్థి కె.మణికంఠ రన్నింగ్ పోటీల్లో మెరిశారు. ఈ నలుగురికి గురువారం సంస్థ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని స్కూల్ హెచ్ఎం రాంప్రసాద్, స్కూల్ కమిటీ సభ్యులు ఎం.ఇందిర, ఉపాధ్యాయులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వాల్తేర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన


ఎలక్ట్రికల్ లోకోషెడ్ వద్ద మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ గురువారం రెండో రోజు వాల్తేర్ డివిజన్ పరిధిలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అక్కడ జరగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మహిళా సిబ్బంది, అధికారులు, సిబ్బందితో జీఎం ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రో మేగ్నటిక్ క్రాక్ డిటెక్షన్ యూనిట్, ఎయిర్‌డ్రైయిర్ టెస్ట్ బెంచ్, లోకో బాడీ వాషింగ్, క్లీనింగ్ యూనిట్‌లను ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఎంపికైన అమృత్ స్టేషన్స్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో డివిజన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులపై జీఎం సమీక్షించారు. పర్యటనలో డీఆర్ఎంతోపాటు డివిజనల్ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' శిబిరాలతో ఎంతో మేలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరిష్మా చంద్

కంచరపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం 48వ వార్డు ఊర్వశి కూడలి బర్మాక్యాంప్ పరిధిలోని ఇందిరానగర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. 348 మంది స్థానికులు వైద్య సేవలు పొందారు. వీరిలో నలుగురిని ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. పలువురు రోగులకు ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సి.హరిష్మా చంద్ మాట్లాడుతూ ప్రస్తుతం పలు ప్రాంతాల్లో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో ఆరోగ్య సురక్షణ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్యాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, కన్వీనర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

'సంపూర్ణ హక్కు'తో సంతోషం


లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం ఓటీఎస్ ద్వారా సొమ్ము చెల్లించిన లబ్ధిదారులకు కార్పొరేటర్ బర్కత్ అలీ జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం పత్రాలను పంపిణీ చేశారు. వార్డులోని 298 సచివాలయం పరిధిలో హైదర్ అలీ, నసీమా బేగం, అదే ప్రాంతానికి చెందిన మరొకరికి పట్టాలు అందజేసినట్టు కార్పొరేటర్ తెలిపారు. గృహాలపై సంపూర్ణ హక్కు సాధించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు

గంజాయితో పోలీసులకు పట్టుబడిన ఇద్దరు


ఇద్దరు నిందితులు, గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విజయవాడ రైల్వే జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావుల ఆదేశాలతో విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు నేతృత్వంలో పలు బృందాలను ఏర్పాటు చేసి రైల్వే స్టేషన్‌లో నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వినయ్‌శ్రావణ్‌కుమార్, జగదీష్ అనే యువకుల బ్యాగులను తనిఖీ చేయగా వీరి వద్ద సుమారు 5.9 కేజీల గంజాయి పట్టుబడింది. దీనిని విశాఖ నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అక్రమ రవాణా చేస్తున్నట్లు వీరు తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు, సిబ్బంది, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికే పింఛన్.. ఆనందం తెచ్చెన్


50వ వార్డులో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ ధనుంజయ్


51వ వార్డులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న రెయ్యి వెంకటరమణ


24వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి


సీతమ్మధార: ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్ ఇంటికి రావడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. 24వ వార్డు 123 సచివాలయంలో పింఛన్ల పంపిణీ చురుగ్గా జరిగింది. ముఖ్య అతిథి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీన రూ.3 వేల పింఛన్లు అందిస్తున్నారన్నారు. 231 మందికి రూ.6,95,000 పెన్షన్ల సొమ్ము పంపిణీ చేశారు. సైనిక వెల్ఫేర్ పింఛన్ రూ.5 వేలు అందించారు. సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ కుమారి, వలంటీర్లు రాణి, యమున పాల్గొన్నారు.

50, 51, 53 వార్డుల్లో..

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో పూర్తి స్థాయిలో ఉన్న నాలుగు సచివాలయాలు, మరో వార్డుతో కలిసి ఉన్న మూడు సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సూచనల మేరకు రూ.3 వేల పింఛన్లు అందించారు. 292 సచివాలయం అడ్మిన్ సెక్రటరీ శివకృష్ణ, వలంటీర్ ధనుంజయ్, సచివాలయ సిబ్బందితో కలిసి ఒంటరి మహిళలు, అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ సొమ్ము పంపిణీ చేశారు. 278, 279, 280, 288, 292, 293, 294 సచివాలయం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

- 51వ వార్డులో కార్పొరేటర్, 289 సచివాలయ కన్వీనర్ రెయ్యి వెంకటరమణ లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛను నగదు అందించారు. 286, 287, 288, 289, 290, 291 సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందజేశారు.
- 53వ వార్డులో కార్పొరేటర్ బర్కత్ అలీ సూచనల మేరకు 295, 296, 297, 298 సచివాలయాల పరిధిలో వలంటీర్లు, కన్వీనర్లు, సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ సొమ్ము పంపిణీ చేశారు.

'గ్రీవెన్స్'తో సమస్యల పరిష్కారం


వినతిపత్రం స్వీకరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నెడ్‌క్యాప్ ఛైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి తక్షణం కొన్నింటిని పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలభైరవ స్వామి షష్టి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో శుక్రవారం కాలభైరవ షష్టి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. సాయంత్రం కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేస్తామన్నారు. స్వామికి గారెల దండలు వేసి ప్రత్యేకంగా అలంకరిస్తామని చెప్పారు.

వాకర్స్ క్లబ్ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ స్థాపించి మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 4న వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టు సభ్యుడు ఏహెచ్ఎన్ వెంకటరావు, అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, 101-ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ పాల్గొంటారని చెప్పారు. వాకర్స్ వాయిస్ ఫిబ్రవరి నెల సంచిక ఆవిష్కరిస్తామన్నారు.